# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 23-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు.**
2. **అమరావతి డ్రోన్ సదస్సులో భాగంగా విజయవాడ కృష్ణా నదీ తీరాన గతరాత్రి నిర్వహించిన డ్రోన్ ప్రదర్శన గిన్నిస్ బుక్ రికార్డులను సాధించింది.**
3. **వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేప్రాజెక్టుల భూసేకరణ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
5. **ధరణి పోర్టల్ నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్‌కికు అప్పగించింది.**

=========================

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు నిన్న రష్యాకు చేరుకున్న ప్రధానమంత్రి కజాన్ నగరంలో రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి-సుస్థిరత నెలకొనేందుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని చెప్పారు. భవిష్యత్ లో అన్ని విధాలా సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (25 సెకన్లు )

-------------------------

అమరావతి డ్రోన్ సదస్సులో భాగంగా విజయవాడ కృష్ణా నదీ తీరాన పున్నమి ఘాట్ వద్ద గత రాత్రి డ్రోన్ ప్రదర్శన అత్యంత అద్భుతంగా సాగింది. 5 వేల 5 వందల డ్రోన్ లతో ఆకాశంలో ప్రదర్శించిన పలు ఆకృతులు అందరినీ ఆకట్టుకున్నాయి. డ్రోన్ ప్రదర్శనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. ఈ ప్రదర్శన విశేషాల గురించి మా ఆకాశవాణి ఎన్టీఆర్

జిల్లా ప్రతినిధి కె. నవీన్ కుమార్ మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ ( 30 సెకన్లు )

---------------------------

వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. విజయవాడ రాజ్ భవన్‌లో నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన కాశ్మీరీ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో గవర్నర్ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఆవశ్యకమని అన్నారు. దేశంలోని ఉన్నత విద్యావ్యవస్థ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గవర్నర్ సూచిస్తూ...

వాయిస్ ( 28 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న రైల్వేప్రాజెక్టుల కోసం భూసేకరణ సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రైల్వే ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 72 వేల కోట్ల రూపాయల మేర రైల్వే ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర రైల్వే మంత్రి ఇటీవల తెలిపారని, అందుకు అనుగుణంగా వేగంగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు కేరళలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా వయనాడ్‌లో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ–ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఎన్నికల నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. వయనాడ్, అమేథీ నుంచి పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన రాహుల్ గాంధీ నిబంధనల ప్రకారం ఒక స్థానంలో రాజీనామా చేయాలి. దీంతో ఆయన వయనాడ్‌లో ఎంపీ పదవికి రాజీనామా చేశారు, ఆస్థానానికి ఉప ఎన్నిక జరగనున్న క్రమంలో నామినేషన్ దాఖలు చేయనుండటంతో ఆ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటున్నారు.

---------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై చర్చించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోం శాఖ రేపు సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ అంశంపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ప్రతినిధి సాయి శిష్ట్లా అందజేస్తారు.

వాయిస్ ( 25 సెకన్లు )

---------------------------

ధరణి పోర్టల్ నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ – ఎన్ఐసీకి అప్పగించింది. మూడేళ్ల పాటు పోర్టల్ నిర్వహణకు ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్ఐసీతో

ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనితీరుని బట్టి మరో రెండేళ్లు పొడిగిస్తామని ప్రభుత్వం ఒప్పందంలో పేర్కొంది. కాగా తెలంగాణలో వ్యవసాయ భూముల అమ్మకం, కొనుగోళ్లు వంటివి ధరణి పోర్టల్ ద్వారానే కొనసాగుతున్నాయి.

---------------------------

ఈరోజు జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆయుర్వేద వైద్యానికి మూలపురుషుడు వైద్య నారాయణ ధన్వంతరి జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. ఆయుర్వేద వైద్య విధాన ప్రాముఖ్యతను తెలియజేసే.. ఈ వైద్య చికిత్స వల్ల ఒనగూరే ఆరోగ్య ప్రయోజనాల పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ రోజు రాష్ట్రంలోని గుంటూరు, వైఎస్సార్ జిల్లాల్లో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా తెనాలిలో దుండగుల దాడికి గురైై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతిని, ఆమె కుటుంబాన్ని ఈరోజు ఉదయం కలుసుకుని పరామర్శిస్తారు. ఆ తర్వాత వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో హత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ఈ మధ్యాహ్నం పరామర్శించనున్నారని, అనంతరం పులివెందులకు వెళ్తారని వైసీపీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నిన్న తీవ్ర వాయుగుండంగా బలపడిందని, రేపటికి తీవ్ర తుపానుగా మారనుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు బంగాళాఖాతం నుంచి తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోందని వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

అలాగే తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ రోజు, రేపు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ ను జారీ చేసింది.

======================